సాక్షి ఒడిశా

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,43,122లు, బంగారం 1గ్రాము 810 మిల్లీగ్రాములు వెండి 35 గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మంచం పట్టిన హలువ గ్రామం

రాయగడ సమితి పరిధిలోని హలువ గ్రామం జ్వరంతో మంచం పట్టింది.

-IIలో▸



గంజాయితో నలుగురు అరెస్టు

గుట్టుచప్పుడు కాకుండా ఆటోలో గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను గుడారి పోలీసులు పట్టుకున్నారు.

-IIలో▸

రావయ్యా.. బొజ్జ గణపయ్య






వినాయక చవితి ఉత్సవాలకు వేళయ్యింది. శనివారం నుంచి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పల్లె పట్టణాలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లోని ప్రతి వీధిలో మండపాలను యువత సిద్ధం చేస్తుండగా..గణనాథుని ఆలయాలు సైతం విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. అలాగే ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం మార్కెట్లలో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. మండపాల్లో కొలువుదీరేందుకు గణనాథులు భారీ వాహనాలపై తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్




ఖుర్దా రోడ్ ప్రాంతంలో గజపతి ఉత్సవాల విద్యుద్దీపాలంకరణ



మునిగూడ పైకో వీధిలో ఏర్పాటు చేసిన పెండాల్



మునిగూడలో వీరవిక్రమ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెండాల్



రాయగడలో ఏర్పాటు చేసిన పెండాల్



విద్యుత్ అలంకరణలో మెరిసిపోతున్న ఖుర్దారోడ్

న్యూస్‌రీల్

జీవన సాఫల్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రఘుపాత్రుని భీమారావు

భువనేశ్వర్: సీఎస్ఐఆర్ మాజీ చీఫ్ సైంటిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘుపాత్రుని భీమారావుకు భారత ప్రభుత్వ అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ తరఫున ముంబై ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్ సీఎండీ డాక్టర్ దీపేంద్ర సింగ్ జీవన సాఫల్య పురస్కారం శుక్రవారం ప్రదానం చేశారు. కొచ్చిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ సత్కారం అందుకున్నారు.

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

భువనేశ్వర్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో ఈనెల 10వ తేదీ వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈనెల 9వ తేదీ నాటికి ఇది వాయువ్య బంగాళాఖాతం మరియు గంగా నది పరిసర ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా మరియు బంగ్లాదేశ్ తీరాల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని స్థానిక భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) సమాచారం. మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్, నువాపడా, కలహండి, జగత్సింగ్‌పూర్, కేంద్రాపడా, కటక్, ఖుర్దా, పూరీ, నయాగఢ్, గంజాం, గజపతి, మయూర్‌భంజ్, కెంజొహర్, బొలంగీరు, సుందరగఢ్, రాయగడ, కలహండి, సంబలపూర్ జిల్లాల్లో 7 సెంటీమీటర్ల నుంచి 11 సెంటీ మీటర్ల వరకు భారీ వర్ష సూచన వాతావరణ కేంద్రం జారీ చేసింది.

విజిలెన్స్ దాడులు



సోదాలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

భువనేశ్వర్: స్థానిక ఝరపడా ప్రత్యేక జైలు మాజీ సూపరింటెండెంట్ సత్య ప్రకాష్ స్వంయి ఇళ్లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేపట్టారు. లోగడ కెంజొహర్ జిల్లా కారాగారం సహాయ సూపరింటెండెంట్‌గా ఆయన పని చేశారు. కెంజొహర్, భువనేశ్వర్, భద్రక్ తదితర 7 చోట్ల ఒడిశా విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపడుతున్నారు. స్థానిక ప్రత్యేక న్యాయమూర్తి, విజిలెన్స్ జారీ చేసిన సెర్చ్ వారెంట్లతో 12 మంది డీఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐ, ఏఎస్ఐలు మరియు ఇతర సహాయక సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నారు.

చెరువులో పడి ఇద్దరు బాలికలు మృతి



బాలికల మృతదేహాలు

కొరాపుట్: చెరువులో పడి ఇద్దరు బాలికలు మృతి చెందిన ఘటన నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్డ సమితి చిల్లి పొదర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రబోత్ర కుమార్తె తను బోత్ర (7), నంద బోత్ర కుమార్తె మంజులా బోత్ర (7)లు సమీపంలోని చెరువులో స్నానం చేయడానికి ఉదయం వెళ్లారు. అయితే వీరు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీపంలో గాలించారు. అనంతరం కొసాగుమ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చెరువులో గాలించి మృతదేహాలను బయటకు తీశారు. ఘటనపై కొసాగుమ్డ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధురాలు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల ఏనుగు దాడిలో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైన ఘటనలు శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నాయి. అంగుల్ జిల్లా బొంతొలా అటవీ ప్రాంతం జముండా గ్రామంలో జరిగిన ఏనుగు దాడిలో వృద్ధురాలు మృతి చెందింది. మృతురాలు కుస్తు దేహూరి (70)గా గుర్తించారు. బొంతొలా గ్రామంలో మరో మహిళ ఏనుగు దాడిలో గాయపడింది. ఇంటి పెరటిలో పువ్వులు ఏరుతుండగా కుమారి సాహుపై ఏనుగు దాడి చేసింది. అంగుల్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఒడిశాలో పేదరికం తగ్గుదల

• సీఎం మోహన్ చరణ్ మాఝీ



భువనేశ్వర్: గతేడాది జూలై నెలలో నీతి అయోగ్ ప్రచురించిన బహుమితీయ పేదరిక సూచిక (ఎంపీఐ) పురోగతి సమీక్ష 2023 ప్రకారం ఒడిశా బహుమితీయ పేదరికంలో గణనీయమైన తగ్గుదలను సాధించింది. 2015–16, 2019–21 మధ్య రాష్ట్ర బహుమితీయ పేదరికం 29.34 శాతం నుంచి 15.68 శాతానికి తగ్గిందని, 62.6 లక్షల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని బీజేడీ ఎమ్మెల్యే ధ్రుబ సాహూ ప్రశ్నకూ స్పందిస్తూ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అసెంబ్లీకి ఈ విషయం తెలియజేశారు. జాతీయ స్థాయిలో 14.96 శాతం బహుమితీయ పేదరికం రేటుతో, తలసరి అనుపాతం పరంగా ఒడిశా ఇప్పుడు జాతీయ స్థాయిలో 8వ స్థానంలో ఉందన్నారు.

తలసరి ఆదాయం పెరుగుదల

రాష్ట్ర తలసరి ఆదాయం 2004లో రూ.20,540 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,40,897లకు పెరిగిందని ప్రభుత్వం సభలో వెల్లడించింది. తలసరి ఆదాయాన్ని మరింత పెంచడానికి, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, ఇతర రంగాలపై దృష్టి సారిస్తోందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం విభిన్న కార్యక్రమాలు రూపొందిస్తుందన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

• మాజీ సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో తీసుకురానున్న వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని ఒడిశా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిజూ జనతాదళ్ నిర్ణయించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన బీజేడీ బలహీన విభాగం సమావేశం ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఒడిశా రాష్ట్రం సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రసిద్ధి అని పేర్కొన్నారు. శాంతిని పెంపొందించేలా సామాజిక సామరస్యాన్ని కాపాడాలని పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన సాంస్కృతిక వైవిధ్యం గురించి మనం గర్విస్తున్నామన్నారు. సంపన్న దేశాన్ని నిర్మించాలంటే అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. బలహీన వర్గాలకు చెందినవారు నిత్యం తనను కలుస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారి భయాందోళనలను పరిగణనలోకి తీసుకొని వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

భద్రక్‌లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు

• పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ చంద్ర స్వైన్

భువనేశ్వర్: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భద్రక్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని యోచిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ చంద్ర స్వైన్ తెలిపారు. కటక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సభలో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో ఈ విషయం వెల్లడించారు. అలాగే పారాదీప్‌లో మెగా ఫీడ్ క్రాకర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భద్రక్‌లోని టెక్స్‌టైల్ పార్కులో ఈ ప్లాంట్‌లోని అనుబంధ మిగులు పదార్థాలతో పునరుత్పత్తిని చేపడతారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంపొందించేలా మరిన్ని ఎంఎస్ఎంఈల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కేటాయింపులు చేసిందన్నారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధి విధానం – 2022 ప్రకారం ఇంజినీర్లను స్వావలంబనగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గతేడాది నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ ప్రభుత్వం రూ.58,042 కోట్ల పెట్టుబడితో పారాదీప్‌లో మెగా డ్యూయల్ ఫీడ్ క్రాకర్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ఐఓసీఎల్ ప్రోత్సాహక ప్రతిపాదనను ఆమోదించింది. 2,822 కిలో టన్నుల సామర్థ్యం (కేటీఏ) వార్షిక ఉత్పాదన లక్ష్యంతో డ్యూయల్ ఫీడ్ క్రాకర్ యూనిట్ ఇథిలీన్, పాలీ ప్రొపైలిన్, పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ), ఫినాల్, ఐసో – ప్రొపైల్ ఆల్కహాల్ (ఐపీఏ) ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది.

నూతన విద్యా విధానంతో మేలు



నూతన విద్యా విధానంపై సావనీర్ విడుదల చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని బ్రహ్మపుర విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ గీతాంజలి దాస్ అన్నారు. స్థానిక కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో జరిగిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు స్కిల్ డవలప్‌మెంట్ జరుగుతుందని, తద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. బ్రహ్మపుర వర్సిటీ, ఐక్యూఏసీ డైరక్టర్ ప్రొ.సుధాకార్ పాత్రో మాట్లాడుతూ.. నాక్ ఆమోదిత కళాశాలల్లో నూతన విద్యావిధానం ద్వారా 112 కొత్త కోర్సులు అమలు జరగనున్నాయని తెలిపారు. కేంద్రం ప్రతీ కళాశాలకు అదనపు తరగతి గదులు, అధ్యాపకులను నియమిస్తుందని పేర్కొన్నారు. అనంతరం బరంపురం వర్సిటీ వీసీ గీతాంజలి దాస్ నూతన విద్యావిధానంపై సావనీర్ ఆవిష్కరించారు. శ్రీకృష్ణ చంద్రగజపతి కళాశాల ప్రిన్సిపాల్ డా.జితేంద్ర పటానాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, బ్రహ్మపురం పీజీ కౌన్సిల్ చైర్మన్ ప్రొ.సుకాంత కుమార్ త్రిపాఠి, డాక్టర్ సిద్ధార్థ శంకర త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

గాలి జీవకోటికి ప్రాణాధారం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: స్వచ్ఛమైన గాలి జీవకోటికి ప్రాణాధారమని వక్తలు పేర్కొన్నారు. 5వ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం నగర వీధుల్లో చైతన్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ (బీఎంసీ) మేయర్ సులోచన దాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీఎంసీ డిప్యూటీ మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్, సలహా మండలి చైర్‌పర్సన్, స్థానిక కార్పొరేటర్లు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు హాజరయ్యారు. ఇన్వెస్ట్ ఇన్ క్లీన్ ఎయిర్ నౌ నినాదంతో చేపట్టిన ఈ ఊరేగింపులో విద్యార్థులు, స్థానిక సంఘాలు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. గాలి నాణ్యతను మెరుగుపరిచే చర్యలపై దృష్టి సారించాలని చైతన్యపరిచారు.


• సాగర తీరం.. సుందర మార్గం



సుముద్రపు గాలులు మనల్ని తాకుతుండగా.. తీరం వెంబడి చెట్ల మధ్య నుంచి రహదారి ప్రయాణం చేయడం ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. ఆ మార్గం గుండా తీరంలో కొలువైన ఎన్నో ప్రకృతి అందాలను తనివితీరా వీక్షించేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి మార్గమే శ్రీజగన్నాథ క్షేత్రం పూరీ నుంచి అర్క క్షేత్రం కోణార్క్ చంద్రభాగ తీరం మధ్య ఉంది. సుమారు 35 కిలోమీటర్లు తీరప్రాంతం వెబండి నిర్మించిన అద్భుతమైన రోడ్డు మార్గమిది. ఈ మార్గంలో ప్రయాణం మధుర జ్ఞాపకాలను ఇస్తుందని పర్యాటకులు పేర్కొంటున్నారు.

– భువనేశ్వర్

• కొట్టుకొచ్చిన కంటైనర్



పూరీ బీచ్‌లో కంటైనర్ ఒడ్డుకు కొట్టుకొచ్చింది. స్థానిక పెంటకోట సమీపంలో తీరానికి 1.5 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో కంటైనర్ తేలుతున్నట్లు కొందరు మత్స్యకారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కంటైనర్‌ను బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం కంటైనర్ శ్రీజగన్నాథ సంస్కృత విశ్వ విద్యాలయానికి సమీపంలోని గంగా దేవి మందిర్ వద్ద ఉంది.

– భువనేశ్వర్

క్లుప్తంగా

యోగా కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని యోగా అండ్ ఫిట్నెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించను న్న యోగా పీజీ డిప్లమా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు 30 శాతం రాయితీ ఫీజులో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని రూ.200 ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9603699414 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


శ్రీకాకుళం కెల్లవీధిలో పర్యటించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని కెల్ల వీధిలో పర్యటించారు. అక్కడ చేపడుతున్న ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరును పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అక్కడ ప్రజలకు డ్రైడే ఫ్రైడేపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపాల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, బి.గణేష్ కుమార్, సచివాలయ, మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవు కడుపులో వ్యర్థాల తొలగింపు


ఆవు కడుపులోని వ్యర్థాలు

కోటబొమ్మాళి: నరసన్నపేట మండలం మడపాం గ్రామానికి చెందిన రైతు మర్ల గోపాలరావుకు చెందిన ఆవు కడుపులోని 15 కేజీల వ్యర్థాలను ఆపరేషన్ చేసి కురుడు పసువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ శుక్రవారం తొలగించారు. 10 రోజులుగా ఆవు మేత మేయకుండా ఉండటం, కడుపు ఉబ్బి ఉండటంతో కిరణ్‌కుమార్‌ను రైతు సంప్రదించాడు. దీంతో శుక్రవారం ఆవు కడుపులో వ్యర్థాలు ఉన్నట్లు గ్రహించి ఆపరేషన్ చేసి వ్యర్థాలను తొలగించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వృద్ధుడు

బూర్జ: కొల్లివలస గ్రామం నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు చికిత్స కోసం వెళ్లిన వృద్ధుడు శుక్రవారం మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలియ జేశా రు. ఆగస్టు 28న 108 వాహనంలో కొల్లివల స నుంచి రిమ్స్‌కి వెళ్లి వైద్యం పొందుతూ మృతి చెందడంతో రిమ్స్ అవుట్ పోస్టు నుంచి సమాచారం తెలియజేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు శ్రీకాకుళం రిమ్స్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

బంగారు సుధాకర్


సుధాకర్

ఎచ్చెర్ల: లావేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంజీవి నళినీ సుధాకర్ పతకాల పంట పండించారు. నేపాల్ దేశం పొకరపట్నంలో ఉన్న రంగసామి అంతర్జాతీయ క్రీడా ప్రాంగణంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీన వరకూ నిర్వహించిన పదో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ 60 ఏళ్ల వయస్సు గ్రూపులో పాల్గొని మూడు, ఐదు, పది కిలోమీటర్ల నడక పోటీల్లో రేస్‌వాకింగ్ చేసి మూడు బంగారు పతకాలను గెలుపొందారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ చరిత్రలో గత 50 ఏళ్ల కాలంలో ఎవరూ రేస్ వాకింగ్‌లో పాల్గొనలేదు. అలాంటిది సుధాకర్ మూడు బంగారు పతకాలతో చరిత్ర సృష్టించారు. ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జగన్నాథరావు, జిల్లా క్రీడాప్రాంగణ ముఖ్య శిక్షకులు కె.శ్రీధర్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు ఎల్.ఈశ్వరరావు, మురళీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, గ్రామపెద్దలు, క్రీడాభిమానులు అభినందించారు.

బారులుతీరిన మహిళలు


పర్లాకిమిడి: జనసేవ కేంద్రాలు వద్ద మహిళలు


మల్కన్‌గిరి: పోస్టాఫీస్ వద్ద క్యూలో ఉన్న మహిళలు

పర్లాకిమిడి: పట్టణంలో కేంద్ర పోస్టాఫీసు, జనసేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ చేసేందుకు మహిళలు బారులుతీరారు. సుభద్ర పథకం వర్తించాలంటే మొబైల్ నంబర్ తప్పనిసరిగా లింక్ ఉండాలని చెప్పడంతో ఉదయం సరికే లింక్ చేసేందుకు గుమ్మా, కాశీనగర్ నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున పర్లాకిమిడి చేరుకున్నారు. ఇదిలా ఉండగా 14వ వార్డు చాకలివీధి, ఖంజావీధి, ఇరడల వీధుల్లో వార్డు కౌన్సిలర్ జ్యోతిర్మయి దాస్ సుభద్ర పథకంపై మహిళలకు అవగాహన కలిగిస్తున్నారు.

మల్కన్‌గిరి: సుభద్ర పథకానికి సంబంధించి కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. దరఖాస్తు చేసేందుకు వచ్చే మహిళలకు జనసేవ కేంద్రాల్లోనే తంబ్, కళ్లు ద్వారా లింక్ చేయనున్నట్లు తెలియజేశారు. ఆధార్ నంబర్‌కు మొబైల్ నంబర్ లింక్ అవ్వకుంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు.

నాలుగు నెలలకే నరకం

• అధ్వానంగా మారిన రహదారి


అధ్వానంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ బ్లాక్‌లోని డయటా నుంచి తరపడా వరకు నువాగుడ, బెలగాం మీదుగా పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించిన రోడ్డు నాలుగు నెలలకే అధ్వానంగా మారింది. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్న ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని నంబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డును పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.2.30 కోట్లతో రహదారి నిర్మాణం పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ ఇంతలోనే రోడ్డు దారుణంగా మారిపోవడంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానన్నారు. దీనికి అధికారులు స్పందించి రోడ్డును మరలా నిర్మిస్తామని, కాంట్రాక్టర్‌ను బాధ్యుడిగా చేస్తామని తెలియజేశారు. భారీ వాహనాలు తిరగడం వలనే రోడ్డు ఇలా తయారైందని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన శిబిరం


రైతులకు అవగాహన కల్పిస్తున్న విశ్వరంజన్

జయపురం: పంటకు పట్టే వ్యాధులు, క్రిములను సంహరించే మందులపై ప్రముఖ రసాయనిక ఎరువులు ఉత్పత్తి సంస్థ ఇఫ్‌కో శుక్రవారం జయపురంలో అవగాహన శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో కొరాపుట్ జిల్లా ఇఫ్‌కో డిప్యూటీ మేనేజర్ విశ్వరంజన్ జయసింహ పాల్గొని తక్కువ ఖర్చుతో కీటకాలను నాశనం చేసే పద్ధతులను వివరించారు. వివిధ క్రిమి సంహారక మందులను రైతులకు పరిచయం చేస్తూ వాటిని ఎలా వినియోగించాలో వివరించారు. శిబిరంలో ఇఫ్ కో అధికారులు బిభు ప్రసాద్, బికాస కుమార్ సాంత తదితరులు పాల్గొన్నారు.

15 సెల్‌ఫోన్లు రికవరీ

• నిందితులు అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో అంకిత వర్మ

జయపురం: సబ్ డివిజన్ పరిధి 4 పోలీసుస్టేషన్లలో దొంగతనానికి గురైన 15 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత వర్మ వెల్లడించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ల దొంగతనాలపై సబ్ డివిజన్ పరిధిలోని పోలీసుస్టేషన్లలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ముఖ్యంగా జయపురం పట్టణం, జయపురం సదర్, బొయిపరిగుడ, కుంద్ర పోలీసుస్టేషన్లలో అధికారులు సెల్‌ఫోన్ల దొంగలను పటుకునేందుకు చర్యలు చేపట్టారని వెల్లడించారు. బొయిపరిగుడ పోలీసులు 5 సెల్‌ఫోన్లు, కుంద్ర, జయపురం సదర్ పోలీసుస్టేషన్లలో 4 చొప్పున 8 సెల్‌ఫోన్లు, జయపురం పట్టణ పోలీసులు రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేయడంతో పాటు నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైనవారిలో ఘొటొగుడ గ్రామానికి చెందిన రాఘవ పూజారి, స్థానిక ఒడియా మేదరి వీధికి చెందిన రింకు భాగ్, గోపబందున గర్‌కు చెందిన పద్మన మచ్చలతో పాటు వాటిని కొనుగోలు స్థానిక గాడవీధికి చెందిన చందన బొటొ మిశ్రలు ఉన్నట్లు తెలిపారు. మొత్తం వారి నుంచి 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, యజమానులకు అప్పగించారు.

బీజేడీ నుంచి ఎంపీ సుజీత్ సస్పెండ్

భువనేశ్వర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు రాజ్యసభ ఎంపీ సుజిత్ కుమార్‌ను బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పార్టీ నుంచి బహిష్కరించారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన ఆరోపణ కింద బిజూ జనతా దళ్ నుంచి ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మరోవైపు సుజిత్ కుమార్ సైతం రాజ్యసభ ఎంపీగా రాజీనామా చేశారు. అనంతరం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కటక్ లోక్‌సభ ఎంపీ భర్తృహరి మహతాబ్ ఇతర బీజేపీ నేతల సమక్షంలో బీజేపీలో చేరారు. మిగిలిన 20 నెలల పదవీకాలానికి ఆయనను బీజేపీ నుంచి రాజ్యసభకు పంపవచ్చు. సుజిత్ కుమార్ రాజీనామా చేయడంలో మమతా మొహంతాను అనుకరించినట్లు తెలుస్తోంది. అతను ఏప్రిల్ 2020లో బిజూ జనతా దళ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యాడు.

రెవెన్షాకు రక్షణ అవసరం

భువనేశ్వర్: క్యాంపస్‌లో విద్యార్థులు, కొంత మంది బయటి వ్యక్తుల మధ్య గొడవ జరగడంతో కటక్‌లోని రెవెన్షా విశ్వ విద్యాలయం విద్యార్థులు, సిబ్బంది, వారి కుటుంబాలకు పోలీసుల నుంచి రక్షణ కోరింది. సుమారు 3,000 మంది బయటి వ్యక్తులు సృష్టించిన అవాంతరాల కారణంగా క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థులు మరియు అధ్యాపకుల భద్రత కోసం పోలీసులను మోహరించాలని రిజిస్ట్రార్ కటక్ డీసీపీకి లేఖ రాశారు. సెప్టెంబర్ 1 నుంచి రెవెన్షా పేరు మార్చాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి చేసిన సూచనకు వ్యతిరేకంగా కొందరు బయటి వ్యక్తులు నిరసనలు చేస్తున్నారని రిజిస్ట్రార్ తెలిపారు. క్యాంపస్‌లో సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి తక్షణ పోలీసు రక్షణ అనివార్యంగా అభ్యర్థించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

జయపురం: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా 6 ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ స్పష్టం చేశారు.

వివాహిత ఆత్మహత్య

ఇచ్ఛాపురం రూరల్: భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి ఘర్షణతో మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మపురం గ్రామానికి చెందిన రంగాల నూకయ్యతో టి.బరంపురం పంచాయతీ కొత్తూరు గ్రామానికి సుజాతకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. నూకయ్య గల్ఫ్ ప్రాంతాలకు వలస కూలీగా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆమె భర్తపై కోపంతో గురువారం బాడీ లోషన్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిగా బరంపురం పెద్దాస్పత్రికి తరలించారు. అక్కడే ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచం పట్టిన హలువ గ్రామం


జ్వరంతో బాధపడుతున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని హలువ గ్రామం జ్వరంతో మంచం పట్టింది. జిల్లా కేంద్రానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో 34 కుటుంబాలకు చెందిన వంద మంది కిపైగా జనాభా నివసిస్తున్నారు. గత వారం రోజులుగా ఈ గ్రామంలో జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రతీ ఇంట్లో కనీసం ఒకరైనా జ్వరంతో బాధపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. పరిస్థితి చేయిదాటక ముందే జిల్లా వైద్య శాఖ అప్రమత్తమై వ్యాధిని అదుపు చేయాల్సిన అవసరం ఉంది. జ్వరాలతో మంచాలు పట్టినా ఇంతవరకు ఎవ్వరూ వైద్యులను సంప్రదించి చికిత్సను చేయించుకే దాఖలాలు కనిపించడం లేదు. కొందరు నాటు వైద్యంపై ఆధాపడుతుండగా, మరికొందరు తగ్గిపోతుందిలే అన్న దీమాతో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ వైద్యశాఖ స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సర్పంచ్ తమ్మారావు బిడిక కోరుతున్నారు.

• మహిళలకు శిక్షణ శిబిరం


శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: మహిళా స్వయం సహాయక గ్రూపులు చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని బీడీవో రాజీవ్ దాస్ అన్నారు. పట్టణంలో ఖాదీ, గ్రాముద్యోగ్ పరిశ్రమల కమిషన్ (కె.వి.ఐ.సీ.) స్కిల్ అప్‌గ్రేడేషన్ శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరం ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుంది. శిబిరంలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లు ద్వారా ఎలా చింతపండు గుజ్జును తీయవచ్చో అసిస్టెంటు డైరక్టర్ బిచిత్రానంద పండా తెలియజేశారు. శిబిరంలో మోహనా అటవీ శాఖ అధికారి లక్ష్మీప్రసాద్ బిసాయి, జీవనోపాధుల శాఖ బీపీఎం కార్తీక్ నాయక్, కో–ఆర్డినేటర్ ఆర్.కె. రథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈజీ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నరసన్నపేట: స్థానిక జగన్నాథపురంలో నివాసం ఉంటున్న గుర్రాల అనూష అనే మహిళా కానిస్టేబుల్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనూష రణస్థలంలో ఎస్ఈబీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త కుమిలి విజయకుమార్ కూడా ఎస్ఈబీ కానిస్టేబులే. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఆమె గురువారం పురుగు మందు తాగేసిందని తల్లి అన్నపూర్ణమ్మ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేసిందని, తాను చూసే సరికి వాంతులు చేసుకుంటుండటంతో నరసన్నపేటలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించామని, పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనూష, విజయ భాస్కర్ ఇద్దరూ 2014 బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు. ఇద్దరూ ప్రేమించి 2018 లో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు నరసన్నపేటలో ఉంటూ చదువుకుంటుండగా అనూష గురువారం నరసన్నపేట వచ్చి తల్లి ఇంట్లో లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడింది.

గంజాయితో నలుగురు అరెస్టు


గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గుట్టుచప్పుడు కాకుండా ఆటోలో ప్రయాణికుల్లా గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను గుడారి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 27.700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒక మహిళ కూడా ఉంది. నిందితుల నుంచి గంజాయితో పాటు రూ.3,650ల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు తరలించారు.

అనుమతుల ముసుగులో అక్రమ వ్యాపారం


అంబళ్లవలసలోని సీజ్ చేసిన ఇసుక

గార: అనుమతుల ముసుగులో ఇసుకను దోచుకోవడానికి టీడీపీ నాయకులు ప్రణాళిక వేశారు. బూరవెల్లి, అంబళ్లవలస వద్ద సీజ్ చేసిన ఇసుక నుంచి శాంతి కన్‌స్ట్రక్షన్స్ పేరిట రైల్వే కాంట్రాక్టర్‌కు 500 టన్ను ల ఇసుకను అందించేందుకు కలెక్టర్ అనుమతులిచ్చారు. వీటిని జిల్లా పరిధిలోని రైల్వే స్టేషన్ల వద్దనే ఇచ్చేందుకు అనుమతి ఉంది. అయితే రోజుకు 20 టన్నులు మాత్రమే తీసుకెళ్లేందుకు అవకాశం ఇచ్చా రు. ఇక్కడి నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ రైల్వే కాంట్రాక్టర్‌ను స్థానిక టీడీపీ నాయకుడు నిలువరించి ఇసుక తీసుకెళ్లకూడదని చెప్పారు. దీంతో ఆ కాంట్రాక్టర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో.. ప్రభు త్వ పనులకు ఇవ్వాల్సిందేనని కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన వాహనంతో రావడంతో ఆ టీడీపీ నాయకుడు మరిన్ని లారీలతో ఇసుకను తీసుకువెళ్తామని రాజకీయంగా ఒత్తిడి తీసుకువచ్చాడు. అయితే రోజుకి ఒక లారీకి మాత్రమే అవకాశం ఉందని చెక్‌పోస్టు సిబ్బంది చేతులెత్తేశారు. రోజుకి కనీసం 5 లారీలకు తక్కువ కాకుండా అనుమతులు ఇవ్వాలని చెప్పించేందుకు నాయకుడు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతుడు గిరడ రాజు (ఫైల్)


నందిగాం చెరువులో తేలిన గిడక రాజు మృతదేహం

నందిగాం, బూర్జ: నందిగాం ఎదురుబంద చెరువులో పడి బూర్జ మండలం అప్పలపట్నాయకునిపేటకు చెందిన గిరడ రాజు అలియాస్ చిన్నంనాయుడు (36) మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలపట్నాయకునిపేటకు చెందిన రాజుకు కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. రాజు మద్యానికి బానిసైపోవడంతో ఆమె రాజుతో ఉండలేక పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో రాజు తన తల్లితో కలిసి గ్రామంలో ఉంటూ బూర్జ మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో ఉన్న మణికంఠ డాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల మానసికంగా ఆందోళన చెందుతూ ఉండేవాడు. అదే డాబాలో పనిచేస్తున్న పంగ రాము అనే వ్యక్తితో కలిసి ఈ నెల 4న సోంపేట మండలం బెజ్జిపట్టుగలో ఉన్న భూత వైద్యుని వద్దకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని సోంపేటలో ఇద్దరూ మద్యం సేవించి, భోజనం చేసి శ్రీకాకుళం బస్ ఎక్కి శ్రీకాకుళం వరకు టిక్కెట్టు తీసుకున్నారు. బస్సులో ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు. అయితే రాజు నందిగాంలో బస్సు దిగిపోయాడు. రాము నిద్రలేచి కండక్టర్‌ను అడిగితే ఆయన ఈ విషయం చెప్పారు. దీంతో రాము ఇంటికి వచ్చేశారు. నందిగాంలో దిగిన రాజు గ్రామంలోని బజారుకు సమీపంలో ఉన్న ఎదురుబంద చెరువులో శుక్రవారం ఉదయం చెరువుకు స్నానానికి వెళ్లిన వారికి మృతదేహమై కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని ప్యాంట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ సిమ్ కార్డు సాయంతో పోలీసులు మృతుని వివరాలు కనిపెట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

టీచర్ల బదిలీపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన


చీమలవలస ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిరసన తెలుపుతూ ఎంఈఓను నిలదీస్తున్న సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విద్యాశాఖ అధికారుల నిర్వాకంతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని పాఠశాల వద్దకు శుక్రవారం సర్పంచ్ సనపల చెల్లం నాయుడు, ఎఫ్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను బదిలీ చేయడంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 33 మంది ఉన్నారని, 6, 7, 8వ తరగతిలో మరో 30 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గతంలో ఈ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారని అందులో ఒక ఉపాధ్యాయుడు ఇటీవల రిటైరయ్యారని పేర్కొన్నారు. మిగిలిన ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురిని పని సర్దుబాటు పేరుతో చీమల వలస పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురు బదిలీపై వెళ్లిపోతే ఇద్దరు మాత్రమే తమ పాఠశాలలో మిగిలి ఉంటారని మిగిలిన ఇద్దరిలో ఒకరు మెడికల్ లీవ్‌పై ఉన్నారని తెలిపారు. పని సర్దుబాటులో భాగంగా చీమల వలస పాఠశాలకు ముగ్గురు ఎంటీఎస్ టీచర్లను నియమించారని, సబ్జెక్టు టీచర్లను పాఠశాలకు నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న మండల విద్యాశాఖ అధికారి–2 టి.గంగరాజును నిలదీశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని, తమకు ఎవరిపై కోపం లేదని అన్నారు. చీమల వలస పాఠశాలలో తెలుగు లాంగ్వేజ్ పండిట్‌ను పని సర్దుబాటు కింద బదిలీ చేయడానికి జీఓ వర్తించదని ఏ జీఓ ప్రకారం లాంగ్వేజ్ పండిట్‌ను లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారో తెలపాలని ఎంఈఓను సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీలు హై స్కూల్ విద్యార్థులకు క్లాసులు చెబుతున్నారని, దీనిపై దర్యాప్తు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ సమర్థవంతమైన టీచర్లను నియమించకపోవడంపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను మార్చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులపై కలెక్టర్, విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎంసీ చైర్మన్ బొడ్డేపల్లి వైకుంఠరావు అన్నెపు రమణమూర్తి నీలయ్య విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల సీజ్

చీపురుపల్లి: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంకిలిలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ల యజమానుల వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ తైక్వాండో పోటీలకు బయలుదేరిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈ నెల 8 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అగ్రాలో జరిగే జాతీయ సబ్ జూనియర్, జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈ పోటీలకు పి.పునీత్, వి.కుషాల్, ఎస్.సాత్విక్, కె.సాహిత్య, చరిత, భవిష్, హర్షిణి ఎంపికయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, సపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, కోచ్ సీహెచ్ యశస్విని తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్

- నిలిచిన ఎక్సరే, ఈసీజీ సేవలు



డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ వద్ద కాలిపోయిన విద్యుత్ కేబుల్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఆస్పత్రిలో ఈసీజీ, డ్రగ్ డిఅడిక్షన్ సెంటర్ వద్ద ఉన్న ప్యానెల్ బోర్డు వద్ద విద్యుత్ కేబుల్ కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ సమయంలో మంటలు రావడంతో రోగులు పరుగులు తీసారు. రోగులు కేకలు వేయడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎవరికి ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఈసీజీ, ఎక్సరే సేవలు నిలిచిపోయాయి. మిగతా విభాగాలకు గంట తర్వాత విద్యుత్ పునరుద్ధరించడంతో సేవలు ప్రారంభమయ్యాయి.

మహిళను బెదిరించి..

విజయనగరం క్రైమ్: మహిళను బెదిరించి నగదు, సెల్‌ఫోన్ పట్టుకుపోయిన ముగ్గురు నిందితుల్లో ఒకరిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామానికి చెందిన సంతోషి కుమారి వినాయకచవితి పండగకు తన కుమారుడిని తీసుకువచ్చేందుకు ఈ నెల 5న ఉర్లాం నుంచి బయలుదేరి విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగింది. అక్కడ నుంచి ఆనందపురంలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తుండగా, లీలామహల్ థియేటర్ సందులో నడుచుకుంటూ రాత్రి 9 గంటల ప్రాంతంలో వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అడ్డగించి, బెదిరించారు. ఆమెను భయభ్రాంతులకు గురిచేసి తన పర్స్‌లో ఉన్న మొబైల్ ఫోన్, పదివేల నగదు పట్టుకుపోయారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం గంగాలమ్మ గుడివీధికి చెందిన చింత ఆనంద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి పర్స్, మొబైల్, నగదును రికవరీ చేశారు. మిగతా ఇద్దరినీ త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. ఎస్ఐ హరిబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ



చేప పిల్లలను విడుదల చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ సాధ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. కొత్తవలస దుర్గగుడి చెరువులో దోమల లార్వా నివారణలో భాగంగా గంబూషియా చేపపిల్లలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు దోమలే ప్రధాన కారణమన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.జగన్‌మోహన్‌రావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డబ్బీరు గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వంతులాట..!

- సర్కారు బడుల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై పర్యవేక్షణ కరువు
- ఫొటోలు అప్లోడ్ బాధ్యత హెచ్‌ఎంల నుంచి ఎస్ఎంసీ చైర్మన్, సచివాలయ సిబ్బందికి బదలాయింపు
- ప్రతిరోజూ 'సర్వే ఫార్మేట్' అప్‌లోడ్ పనులు హెచ్‌ఎంలకు అదనం
- తొలి వారంలో 30 శాతం స్కూళ్లలో మాత్రమే ఫొటోల అప్లోడ్
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ మండిపడుతున్న చైర్మన్లు



రామభద్రపురం ఉన్నత పాఠశాల

విజయనగరం అర్బన్/రామభద్రపురం:

కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ రచ్చకెక్కింది. పరిశుభ్రత పూర్తిగా లోపించింది. ఫలితం.. విద్యార్థులను అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. పరిశుభ్రత పనులపై జవాబుదారీతనంలో వంతులాట విద్యార్థులకు శాపంగా మారింది. గత ప్రభుత్వం నాడు-నేడు పనుల కింద పేదకుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులను సకల సదుపాయాలతో, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. తరగతి గదులను బాగుచేయడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పక్కాగా కల్పించింది. వీటి పర్యవేక్షణలో భాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రతిరోజూ ఫొటోలు తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం ఈ పనుల బాధ్యతను హెచ్‌ఎంలకు అప్పగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫొటోల అప్‌లోడ్ పనులను ప్రధానోపాధ్యాయుల నుంచి తప్పించి ఎస్ఎంసీ, సచివాలయ సిబ్బందికి అప్పగించింది. వీరిరువురు వారానికి రెండేసి రోజులు విజిట్ చేసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పని ఒత్తిడి తగ్గిందని ప్రధానోపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే మరో అదనపు పని అప్పగిస్తూ ఆదేశాలను విద్యాశాఖ విడుదల చేసింది. ప్రతిరోజు సాయంత్రం టాయిలెట్స్‌కు సంబంధించి పరిశుభ్రత వివరాలను ఐఎంఎంఎస్ యాప్‌లో సర్వే ఫార్మేట్ నింపి సబ్మిట్ చేయాలని హెచ్‌ఎంలకు కొత్తగా మరో యాప్ పనిని అప్పగించింది. దీంతో పరిస్థితి పెనమ్మీద నుంచి పొయ్యిలోకి పడినట్లయిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

మాకు సంబంధం లేదంటున్న ఎస్ఎంసీ చైర్మన్‌లు

మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు, యూరినల్స్ గదుల పరిశుభ్రత ఫొటోల అప్‌లోడ్ బాధ్యతలను స్వీకరించేందుకు ఎస్ఎంసీ చైర్మన్‌లలో చాలా మంది అంగీకరించడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుధ, శుక్రవారం ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రతి సోమవారం, గురువారం సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు పాఠశాలల్లో పరిశుభ్రతపై ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీనిపై అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు పాఠశాల యాజమాన్యకమిటీ సభ్యులు, చైర్మన్లు నిప్పులు చెరుగుతున్నారు. తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా ఈ బాధ్యతలేంటని మండిపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం హెచ్‌ఎంలకు తలనొప్పిగా మారనుంది. పాఠశాలలకు వచ్చి ఫొటోలు తీయండని ఎస్ఎంసీ చైర్మన్లకు చెప్పలేక, చెబితే వారు ఎలా స్పందిస్తారో తెలియక తలపట్టుకుంటున్నారు. అయితే, వంతులాటలతో పాఠశాల పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

1,780 స్కూళ్లకు ఎస్ఎంసీ చైర్మన్లు

జిల్లాలో 1,795 పాఠశాలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్ఎంసీ)ల ఎన్నికల జరగాల్సి ఉండగా వీటిలో 15 మినహా 1,780 స్కూళ్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. మిగిలిన 15 స్కూళ్లకు తొలుత కోరం హాజరులేక ఎన్నికలు ఆగిపోయి. ఈ నెల 30వ తేదీలోగా ఆయా స్కూళ్లలో ఎన్నికలు జరపాలని విద్యాశాఖ ఆదాశాలిచ్చింది. ప్రస్తుతం 1,780 స్కూళ్లలో ఎస్ఎంసీలకు బాత్రూంల పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షణను విద్యాశాఖ అప్పగించింది. అయితే, తొలివారంలో ఫొటోల అప్లోడ్ అసంపూర్తిగా సాగింది. కనీసం 30 శాతం స్కూళ్ల ఫొటోలు కూడా అప్లోడ్ కాలేదని నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలోని ఎస్ఎంసీలు ఉన్న 1780 స్కూళ్లలో తొలి రోజు బుధవారం 700, రెండోరోజు శుక్రవారం 760 స్కూళ్లకు చెందిన ఫొటోలు మాత్రమే అప్‌లోడ్ అయ్యాయి. అదే విధంగా సచివాలయ సిబ్బంది కూడా 530 స్కూళ్లకు సంబంధించిన ఫొటోలే అప్లోడ్ చేసినట్టు ఆన్‌లైన్ నివేదికలు చెబుతున్నాయి.



పాఠశాలలోని మరుగుదొడ్లు

'సర్వే ఫార్మేట్' పనులు మినహాయించాలి

ప్రతిరోజు టాయిలెట్స్ ఫొటోలను తీసే బాధ్యతలను ప్రధానోపాధ్యాయుల నుంచి తప్పించడం సరైనదే. ఐఎంఎంఎస్ యాప్‌లో టాయిలెట్స్‌కు సంబంధించిన సర్వే ఫార్మేట్ నింపి సబ్మిట్ చేయాలన్న పనులు ప్రధానోపాధ్యాయులకు అప్పగించడం దారుణం. వీటి నుంచి మినహాయింపు ఇవ్వాలి.

– ఇజ్జురోతు రామునాయుడు, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

ఇదేమి నిర్ణయం

ఎస్ఎంసీ చైర్మన్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయాలంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో టీచర్ల ఆత్మగౌరవం దెబ్బతీసేలా పనులు చేయిస్తున్నారంటూ విమర్శించి.. అధికారంలోకి వచ్చాక అవే పనులు చైర్మన్లతో ఎలా చేయిస్తారు. మా పిల్లల ముందు తాము అదే పనిచేస్తే మా ఆత్మగౌరవం దెబ్బతినదా.. పునరాలోచించాలి.

– పెద్దింటి శోభ, ఎస్ఎంసీ చైర్మన్, ఎంపీపీ స్కూల్, పాతరేగ

ఉత్తర్వులు అందాయి



ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసే పనిని తల్లిదండ్రుల కమిటీకి, సచివాలయ సిబ్బందికి అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయి. వారంలో రెండు రోజులు ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు, మరో రెండు రోజులు సచివాలయ ఉద్యోగులు మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లో చేయాల్సి ఉంటుంది.

– ఎ.తిరుమలప్రసాద్, ఎంఈఓ, రామభద్రపురం

పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయం : ఎస్పీ



పార్వతీపురం టౌన్: సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామన్నారు. నిత్యం ప్రజా సేవలో నిమగ్నమైన పోలీసు సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎస్పీ సీసీ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్‌డే



విజయనగరం క్రైమ్: పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్‌పి వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

జపనీస్ భాషపై శిక్షణ

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నవీస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాష ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిలలో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జపాన్ దేశంలో పని చేయడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. 32 సంవత్సరాలలోపు వయసు ఉన్న అభ్యర్థుల అర్హులని, శిక్షణ కాలం 6 నెలలు అని, శిక్షణ నవీస్ బెంగళూరులో జరుగుతుందని తెలిపారు. శిక్షణ ఫీజు రూ.3,50,000 అని, పాక్షిక శిక్షణ రుసుము రూ.50,000లతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25,000 చెల్లిస్తుందని మిగిలిన రూ.25,000 అభ్యర్థి చెల్లించాలని మిగిలిన రూ.3,00,000 మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించటానికి కావాల్సిన సదుపాయాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థి వేతనం రూ.1,10,000 నుండి రూ.1,40,000 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్ హెచ్‌టీ టీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ ఎస్ఎస్‌డీసీ.ఇన్/హోం/ఆన్‌లైన్/హోం/ఆన్‌లైన్ ప్రోగ్రాంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96769 65949 నంబరును సంప్రదించాలని సూచించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

- సెల్ఫీలు, వరదల్లో ఈత సరదాలు వద్దు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం, ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని చెప్పారు. వసతిగృహాలను తనిఖీ చేయాలని, శిథిలావస్థలో వున్న భవనాలలో ఎవరూ ఉండరాదని ఆదేశించారు. వరదలు వచ్చేటపుడు, వానలు కురిసేటపుడు సెల్ఫీలు తీసుకోవడానికి, వరదల్లో ఈత కొట్టడానికి ఎవరూ ప్రయత్నించవద్దని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని కోరారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆదేశించారు. అటువంటి ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విపత్తులు సంభవించే అవకాశాలు ఉన్న ప్రదేశాల వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రదేశాలు ఉంటాయని, ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రదేశాల్లో పోలీసు, వలంటీర్లు ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలన్నారు. గత అనుభవాల దృష్ట్యా అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులపై ఉన్న పెద్ద పెద్ద గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్‌లు పడిపోయే అవకాశం వున్న భవనాలు, మట్టి ఇళ్లలో వున్న వాటిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులలో మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఉమెన్స్ టైలరింగ్, మగ్గం వర్క్స్ అండ్ పెయింటింగ్ వంటి ఉపాధి కోర్సులపై ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు వచ్చే నెల 5లోగా దరఖాస్తులను పంపాలని కోరారు. వివరాలకు 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సుల్లో గందరగోళం..!

- 40మందిలో 20 మందికే ఆస్పత్రుల కేటాయింపు
- డైలమాలో మిగతా 20 మంది స్టాఫ్ నర్సులు



డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ హాజరైన స్టాఫ్‌నర్సులు

విజయనగరం ఫోర్ట్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే స్టాఫ్ నర్సుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఈ విభాగంలో పనిచేసే సగం మందికే ఉద్యోగాలు ఉండడంతో మిగతా వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్‌హెచ్‌ఎం విభాగంలో వివిధ పథకాల కింద 40 మంది స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రి బలోపేతం, సీమాంక్ కేంద్రం, 8పడకల (హెచ్‌డీయూ), 20 పడకల (హెచ్‌డీయూ) పథకాల్లో వీరు పని చేస్తున్నారు. అయితే ఈ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిపేసింది. దీంతో వారికి జీతాలు రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర పథకాల్లో ఖాళీగా ఉన్న 20 పోస్టుల భర్తీకి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహించారు. 20 మంది స్టాఫ్‌నర్సులను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు కేటాయించారు. మిగతా 20 మంది పోస్టులు ఖాళీ లేకపోవడంతో పోస్టులు కేటాయించలేదు. దీంతో తమ పరిస్థితి ఏంటని డైలమాలో మిగిలిన స్టాఫ్ నర్సులు ఉన్నారు. ఇదే విషయంపై డీఎంహెచ్ఓ భాస్కరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా 20 పోస్టులు భర్తీ చేయగా మిగలిన 20 మంది స్టాఫ్‌నర్సుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



సాంబమూర్తి మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై పణుకుపేట జంక్షన్ వద్ద శుక్రవారం రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి చెందిన వైనమిది. స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పణుకుపేట గ్రామానికి చెందిన ఒమ్మి సాంబమూర్తి(74) రోడ్డు పక్కనే ఉన్న చికెన్ సెంటర్‌కు సైకిల్‌పై వెళ్లాడు. చికెన్ కొనుగోలు చేసి తిరిగి సైకిల్‌తో రోడ్డు దాటుతున్న సమయంలో పార్వతీపురం నుంచి విశాఖపట్నం (నీలంకంఠాపురం ఆర్టీసీ బస్) వెళ్తున్న బస్సు బలంగా ఢీకొంది. దీంతో సాంబమూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు మంతిన వేణుగోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

పార్వతీపురం టౌన్: జునాగడ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. జునాగడ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, చేతిపైన గోరుమాజీ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్‌ను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని, అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

'గోస్తని'లో కొట్టుకుపోయి యువకుడు..



అజయ్(ఫైల్)

జామి: గోస్తని నదిలో ప్రమాదవశాత్తు పడి జామికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బోని ఈశ్వరరావు, పార్వతీ దంపతులకు చెందిన పెద్ద కుమారుడు అజయ్(25) విశాఖపట్నం పోర్టులో దినసరి కూలిగా పని చేస్తున్నాడు. వారానికి ఒకటి రెండు సార్లు జామి వచ్చి వెళ్తుంటాడు. బుధవారం జామి వచ్చిన అజయ్ స్థానిక గోస్తని నదిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఆ సమయంలో వరద నీరు కారణంలో నదిలో ఉధృతి పెరిగి అజయ్ నదిలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం నదిలో గాలించారు. చివరకు సోమయాజులపాలెం రేవు వద్ద అజయ్ మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

కాలువలో జారిపడి యువకుడు..



మృతి చెందిన వెంకటేష్

రేగిడి: మండలంలోని అంబాడ గ్రామానికి చెందిన తూలుగు వెంకటేష్ ప్రమాదవశాత్తు మడ్డువలస సాగునీటి కాలువలో పడి మృతి చెందాడు. ఈ నెల 5న కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని మడ్డువలస కాలువ వద్దకు వెళ్లాడు. కాలువలో దిగుతుండగా జారి పడిపోయాడు, వెంటనే స్థానికులు కాలువలో దిగి వెంకటేష్‌ని బయటకు తీయడంతో పాటు ప్రైవేట్ వాహనం ద్వారా రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకోగానే వెంకటేష్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రేగిడి ఏఎస్ఐ రాజారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం రాజాం చేరుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శవపంచనామ నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. వెంకటేష్ మృతితో తల్లిదండ్రులు లక్ష్మి, సింహాచలం కన్నీరుమున్నీరయ్యారు.



ఘాట్‌రోడ్డుపై బోల్తా పడిన వ్యాన్

వ్యాన్ బోల్తా పడి..

పాచిపెంట: మండలంలోని ఆంధ్రా – ఒడిశా జాతీయ రహదారి 26 ఘాట్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... చత్తీస్‌ఘడ్ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న పండ్ల వ్యాన్ ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హర్యానా రాష్ట్రానికి చెందిన వ్యాన్ డ్రైవర్ సోయబ్(38) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వ్యాన్‌లో ఉన్న మరో వ్యక్తి శంకర్ ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగిసిన 'స్టార్ట్ యువర్ బిజినెస్' సదస్సు




మట్లాడుతున్న జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జనశిక్షణా సంస్థాన్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌లో 'స్టార్ట్ యువర్ బిజినెస్' అనే అంశంపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ నెల 2 నుంచి జరిగిన ఈ సదస్సులో యువతకు వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై రీసోర్స్‌పర్సన్‌లతో అవగాహన కలిగించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయిన జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ సదస్సులోని అంశాలపై అవగాహన చేసుకొని వ్యాపారాలను నిర్వహించుకొని మరికొంత మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎల్ఓ ట్రైనేర్స్ ఎస్.జ్యోత్స్న, వి.అనిల్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి టి.వంశీమోహన్, కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పిడకల ప్రభాకర్, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్వీ రామ్‌పూరి నాయుడు, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

4 వేల క్యూసెక్కుల నీరు విడుదల

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నుంచి ఒక గేటు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోందన్నారు. వచ్చిన నీటిని వచ్చినట్టే విడిచిపెడుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.17 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని ఏఈ తెలిపారు.



ఒక గేటు నుంచి విడిచిపెట్టిన నీరు